టి.బి. వచ్చింది. ఆవిడ కోసం కె.జి.హెచ్‌కి రానూ పోనూ – ఆసుపత్రిలో మూడునాలుగేళ్ళు వుంది – సాటి రోగులు ఒక్కొక్కరూ పిట్టల్లా రాలిపోతూవుండేవారు. అన్ని ఆకులూ రాలాక చివరి ఆకులాగ మా ఆడబడుచు వుండేది. అందరికీ సరిపడే బట్టలు అవీ వుండే అవకాశం ఏదీ? గొయ్యి తవ్వడం, పూడ్చడం– చేతికందిన మేరా మావయ్యగారు అప్పులు చేస్తూ, తీరుస్తూ నలిగిపోతూ వుండేవారు. అలాటి సుడిగుండంలోకి కాపురానికెళ్ళి పాదం పెట్టాను – పెద్ద పళ్ళచక్రం తిరుగుతూంటే దాని కింద మేవంతా చెరుకు కర్రల్లా నలిగిపోతూ వుండేవాళ్ళం. సంసారం అంతా ఒక్క చేతిమీద సాగేది. అడ్వాన్సులూ, లోన్లూ – టియ్యే బిల్లులూ యిలా మూలిగే నక్క మీద తాటిపండులా వచ్చిపడింది – మా మావయ్యగారికి పక్షవాతం.

మా వారికి ఉద్యోగం లేదు. వస్తే బాగుండ్ను అనుకుంటూ వుండగా రైల్వే నుంచి కాల్‌లెటర్ వచ్చింది. ఇంట్లో ఎర్రని ఏగానీ లేదు. ఏం చేస్తారని అడిగితే నాన్నగారు చూస్తార్లే అన్నారు మా వారు.

అప్పుడు మా మావయ్యగారు రిక్షాలో వెళ్ళి ఎక్కడికో ఏదోచేసి ఓ ఎనభై రూపాయిలు అప్పు పుట్టించుకొచ్చి మా వారి చేతిలో పెట్టారు.

ఆ రూపాయిలు నెత్తురు చిమ్ముతున్నాయి. తరువాత మా యింట్లో నాకు నా వెండిగ్లాసు కనిపించలేదు. మా చంటివాడితో ఆడుతూ వాళ్ళ తాతగారు నాకు వినిపించేలా 'వెండిగ్లాసు పోయింది. పోయిందమ్మా పోయింది' అన్నారు. కంచం కూడా పోయేదే – యీలోగా మా వారికి ఉద్యోగం వచ్చింది. ఛల్ మోహనరంగా అని లేచి ఎగిరిపోయాం.

# 'వాక్' విలాసమ్

రోజు తెల్లారగట్ల లేచి మార్నింగ్ వాక్‌కి వెళ్దాం వస్తావా అని మావారు అడిగారు. ఆడాళ్ళకి మాకు మార్నింగ్ వాకులు జోకులూ ఎందుకండీ – యీ గదిలోంచి ఆ గదిలోకి ఆ గదిలోంచి యీ గదిలోకి, వీధిలోంచి వంటింట్లోకి, వంటింట్లోంచి వీధిలోకి, డాబా ఎక్కీ దిగీ యీ ఎక్కడాలూ దిగడాలూ చాలవా మళ్ళీ ఆ తిరుగుళ్ళెందుకు – మీరు కావలిస్తే వెళ్ళండి. కుర్చీల్లో కూచుని పొట్ట పెంచుకునే వాళ్ళకు గాని మా ఫీమేల్సుకి వాకింగ్ గీకింగ్ జాంతానై – అక్కర్లేదు అన్నాను. మావారూరుకోలేదు – అలా పొద్దున్న కాస్సేపు వాకింగ్ చేస్తే 'ఫ్రెష్'గా తాజాగా వుంటుందిలే లేచి రమ్మన్నారు. మీ వాకింగ్ కో దండం మీకో దండం – యీవేసంగాలం కాస్త తెల్లార గట్లే చల్లగా వీస్తుంది – అప్పుడే కాస్త కునుకు పట్టుంది – అలాటి నిద్ర కాస్తా పాడు చేసుకుని లెఫ్ట్ రైటు అంటూ డ్రిల్లు చెయ్యడానికి మనసొప్పదు – మీరెళ్ళి రండి – వెళ్ళి పొట్ట తగ్గించుకోండి అన్నా.

ఛీ! ఛీ! నీకసలు మంచీచెడూ తెలీదు. ఫారిన్లో దంపతులు అంటించిన పేకముక్కలా ఎక్కడి కెళ్ళినా కలిసి మెలిసి తిరుగుతారు. నిజానికి జీవిత భాగస్వామినులంటే వాళ్ళు. మనవాళ్ళు దేనికీ కలిసిరారు. జాయింటుగా వెళ్ళి కూరలు కొనుక్కుందావన్నా కూరలబ్బాయి తెస్తాడు లెండి, కూరలమ్మి వస్తుంది అని తిప్పించుకుంటారు. కలిసి ఏడడుగులు వేశాక మళ్ళీ అడుగులో అడుగులెయ్యరు – భర్తల లాజిక్ భార్యల మేజిక్ రెండూ కలవ్వు. ఆస్పత్రుల్కి, బస్టాండుల్కి, రైల్వే స్టేషన్లకి, షాపింగ్స్కి తప్ప మనం కలిసి హాయిగా ఎక్కడికేనా వెళ్ళామా? మార్నింగ్ వాక్కి వెళ్లడం అంటే ఒక అపవిత్ర మైన విషయంలా నీవు భావించడం నాకెంత నామర్దా' అని వాపోయారు. 'మార్నింగ్ వాక్స్కి యింకెవరన్నా లేడీస్ వస్తూంటారా' అని అడిగా. మార్నింగ్ వాక్స్కి వచ్చే ఆడాళ్ళు కూడా ఆడాళ్ళే కదా!

'వస్తారు కాని వాళ్ళు వాకింగ్ కంటె టాకింగ్ ఎక్కువ చేస్తారు' అన్నారు విసుగ్గా. 'అందుకే నేను రానంది. కాస్త కష్టం సుఖం మంచీచెడూ నిర్మలంగా మాట్లాడుకోవచ్చు నంటే – వాకింగ్ నుంచి టాకింగ్ వేరు చేస్తే ఎల్లాగ?' అన్నా.

'మార్నింగ్వాక్కి వెళ్తున్నావంటే ఆ తొలి వేకువ వెలుగురేకలు విచ్చుకుంటున్నపుడు ఆ ఉషోదయాన్ని చూసి ఆనందించగలగాలి. సౌందర్యారాధన అంటే పవుడర్లు కొట్టుకోడం సెంట్లు రాసుకోడం శారీస్ చుట్టుకోడం కాదు, కాదు, కాదు. ముమ్మాటికీ కాదు. ప్రకృతిని ఆరాధించడమే ఒక కళ –' అని సన్నాయి లెక్చరు సనసన్నగా ప్రారంభించారు.

'మరి పాలపేకెట్ ఎవర్తీసుకుంటారు? ఆ పని మనిషి మనం లేకపోతే అందరిళ్ళూ చిమ్మాక మనిల్లు చిమ్ముతుంది. పక్కలెత్తి ఒబ్బిడిగా మడిచిపెట్టకపోతే యిల్లంతా రావణాసురుడి లంకలా వుంటుంది. అమ్మగారు పొద్దున్నే లేచి షైరుకెళ్ళిందంటే వీధివీధంతా విరగ బడి నవ్వరూ!'

'ఇంతింత పొట్టలేసుకుని గుమ్మాల ముందు పెద్ద గుమ్మడిపళ్ళలా చతికిలబడితే నవ్వరు గాని ఆరోగ్యం కోసం ఉదయం సూర్యుని సప్తాశ్వములతోపాటు షైరుకెళ్తే తప్పా?'

'శివరాత్రిక్కాని వైకుంఠ ఏకాదశికి కాని జనం తెల్లారకుండా లేచి కృష్ణస్నానాలికెళ్ళడం లేదా? చిలకలపూడి వెళ్ళి సముద్రస్నానాలు చేసి రావడంలేదా కుటుంబాలకి కుటుంబాలు?'

'సరె – శివరాత్రికి వైకుంఠ ఏకాదశికి బళ్ళు కట్టుకువెళ్ళి పుణ్యం సంపాదించుకొస్తారు. రేపు నేను తగుదునమ్మా అని మార్నింగ్ వాక్ కెళ్ళి వస్తే దీనికి కళ్ళు నెత్తిమీదకొచ్చాయంటారు. ఇంట్లో తిని కూచుని బట్టన్లు బెల్లులూ నొక్కేవాళ్ళకు గాని తెల్లారి లేస్తే అంటగిన్నెలూ, మాసినబట్టలూ, పక్కబట్టలు ఎత్తని మంచాలు కనిపిస్తూంటే యింకా ఎక్సర్సైజులూ ఆసనాలూ ఎందుకు మాకు?'

'నువు చెప్పేదికుటుంబ డొమెస్టిక్ డ్రడ్జరీ. నేను చెప్పేది ఒక అలౌకికమైన రసానుభూతిని కలిగించే సన్నివేశం. నేచర్ స్టడీ ఎంత మంచిది?'

'ప్రకృతిని చూడాలంటే మన తెలుగు సినిమాల్నిండా టముకుటమా పాటల్ని తీసేస్తే అదే కదా – సినిమాకెళ్ళి వచ్చేటప్పుడు చేయిచేయి పుచ్చుకుని వాకింగ్ చేస్తే సరి –'

"ఛీఛీ గాయత్రితో సమానమైన సంధ్యా వందనంలాటి మార్నింగ్ వాక్‌ని తుచ్ఛమైన నీచమైన వ్యాపార సినిమా కళతో పోలుస్తావా?'

'సినిమాల్లో ఆ ఎగరడాలు ఆ పరిగెత్తడాలు ఆ కొట్లాటలు అవన్నీ ఎక్సర్‌సైజులే కదా - సినిమా హాలు దగ్గర టిక్కెట్లు తీస్తే అది ఒకటోరకం వ్యాయామం. రిజర్వేషన్ లేకుండా రైలు ఎక్కితే అది యింకోరకం వ్యాయామం. సిటీబస్సుల్లోకి దూరి యువతలకు వస్తే అది మరోరకం వ్యాయాయం. ఎన్నో అసౌకర్యాల మధ్య యింకెన్నో వ్యాయామాలుండగా 'మార్నింగ్‌వాక్' ఒక్కటే వ్యాయామం అంటే నేనొప్పుకోను' అన్నా. అప్పుడు శ్రీవారికి ముక్కుమీదకి కోపం వచ్చినట్లుంది - "ఏం పని లేకుండా తిరిగేవాళ్ళని పోరంబోకులంటారు కాని మార్నింగ్ వాక్‌కి వెళ్ళేవాళ్ళని అల్లా అన్రు."

ఊరికే పెద్ద పనులున్నట్లు దేశాలట్టుకు తిరిగే వాళ్ళని దేశద్రిమ్మర్లు అంటారు కాని ఉదయమే లేచి కార్లో బయల్దేరి గ్రవుండ్సుకి వెళ్ళి అక్కడ రవుండ్సు కొట్టేవాళ్ళని వేగబాండ్స్ అనజాలరు. ఓసీ మూర్ఖురాలా? ఇదిగో తెలుసుకో - గుళ్ళోకి కొబ్బరి కాయట్టుకు నడిస్తే అది పవిత్రమైన వాకింగ్, సినిమాకు చుక్కల చీర కట్టుకుని నడిస్తే అది సినీవాక్, రైలు స్టేషన్కి క్రాసింగ్ బ్రిడ్జిమీద నడిస్తే అది జర్నీ వాక్ - యిది యీ మార్నింగ్‌వాక్ మనసుకు ఉల్లాసాన్నిచ్చి రోజంతా తాజాగా చురుగ్గా వుంచే 'వాకింగ్ మానసోల్లాస' అంటారు.

'టాకింగ్ కంటె వాకింగ్ బెస్ట్ - యిది గుర్తుంచుకో' అని సవాల్చేశారు.

'ఆడవాళ్ళు మనసులోకి నడిచి హృదయాల్లోంచి బయటకొస్తారు - ఇంతకీ ఆడదాని నడకలోని అందాన్ని ఆ వయ్యారాన్ని రోజూ మార్నింగ్ వాక్‌లో బయటపెట్టేస్తే -'

రేడియోలోంచి 'సామజవరగమన' వస్తోంది. పెళ్ళాంతో మార్నింగ్‌వాక్ ఈ జన్మకింతే - అని వూరుకున్నారు నెత్తిమీద గోక్కుంటూ.

# 'దూడూడూడూ యెంకన్న'

**బూ**రెలోకి పూర్ణం చేరినట్లు కొత్త సంవత్సరం హడావిడిలోకి మెత్తని మేనత్తలా సంక్రాంతి దూరి పోతుంది. 1986 వేయబోయి కొందరు ఇంకా 1985 వేసికొట్టేసి చివాట్లు తింటూ వుండగానే సంక్రాంతిలక్ష్మి 'దూడూడూడూ యెంకన్నా' అంటూ గంగిరెద్దుతో సహా గంగడోలు ఆడించుకుంటూ వచ్చేస్తుంది. ఈ రోజుల్లో గంగిరెద్దు వచ్చి దణ్ణం పెట్టినా ప్రభువులు పట్టు శాలువలూ కప్పరు, కాలికి కాసులూ మువ్వలూ అసలే కట్టరు. గంగిరెద్దుల్నీ ఆ ఆటల్నీ చూసి ఆనందించే రోజులు వెళ్ళిపోయాయ్, వెళ్ళిపోయాయ్, వెళ్ళిపోయాయ్.